సాక్షి కర్నూలు

మంగళవారం, 14, మే, 2024



అర్ధరాత్రి వరకు పోలింగ్

ఇది గూడూరు మండలం మునగాలలోని 134వ పోలింగ్ కేంద్రం. ఇక్కడ ఈవీఎం మొరాయించడంతో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. 11.20 గంటల సమయంలోనూ 34 మంది ఓటర్లు క్యూలో ఉండటం గమనార్హం.



ఓటు నిక్షిప్తం..

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను సోమవారం రాత్రి రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు చేర్చారు. వీటిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు.



పోలింగ్ రోజూ టీడీపీ ప్రలోభాలు

కర్నూలు నగరంలో టీడీపీ నేతలు పోలింగ్ రోజు కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో డబ్బులు పంచుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఓటర్లకు మర్యాదలే వేరప్పా!

- పెళ్లిళ్ల మాదిరిగా సదుపాయాలు



కర్నూలులో ఓటర్‌కు పువ్వు ఇచ్చి, పన్నీరు చల్లి ఆహ్వానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు భలే మర్యాదలు చేశారు. పెళ్లిళ్లకు వెళ్లిన అనుభూతిని కల్పించారు. కేంద్రాల ముందు పెళ్లి పందిళ్ల తలపిస్తూ తోరణాల నుంచి ప్రత్యేక స్వాగత తోరణాలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 40 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 26 మండలాల్లో 26, మహిళల ఆధ్వర్యంలో 8, యువత ఆధ్వర్యంలో 2, దివ్యాంగుల ఆధ్వర్యంలో మరో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలోకి వెళ్లేముందు పూలు ఇచ్చి స్వాగతం పలకడం, పన్నీరుచల్లి ఆహ్వానించడం, క్యూలైన్ వరకు ఓటర్లను తీసుకొని వెళ్లడం వంటి మర్యాదలు చేయడంతో ఓటర్లు ప్రత్యేక అనుభూతిని పొందారు.

స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు భద్రం

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహకరించడంతో పోలింగ్ సజావుగా సాగినట్లు పేర్కొన్నారు. పోలింగ్ అనంతర ఈవీఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచినట్లు ఆమె వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల సంఘం తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన రామయ్య



దేవనకొండలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

దేవనకొండ: స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య పరిశీలించారు. ఓటింగ్ వివరాలు, పోలింగ్ సరళిని ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ధైర్యంగా ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు.

అధికారి అత్యుత్సాహం

పాణ్యం: మండలంలోని కొలూరు గ్రామంలోని 294 పోలింగ్ కేంద్రంలో ఓ అధికారి అత్యుత్సాహం చూపారు. ఏకంగా ఓటర్లను పక్కదారి పట్టించి టీడీపీ ఓట్లు వేయించే ప్రయత్నం చేశాడు. వృద్ధుల వెంట వచ్చిన కుటుంబ సభ్యులను కాదని ఆ అధికారి స్వయంగా ఈవీఎం వద్దకు వెళ్లి బటన్ నొక్కుతూ కనిపించాడు. అనుమానం వచ్చి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు నిలదీయడంతో అక్కడి టీడీపీ ఏజెంట్లు వారిని బెదిరించారు. దీంతో అక్కడి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసుల సమక్షంలో పోలింగ్ కేంద్రం అధికారి అనంత్‌ను నిలదీశారు. తాను తప్పు చేశానని, క్షమించమని కోరారు.



కర్నూలులోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



పండుటాకు పట్టుదల

క్యూలో నిరీక్షించి ఓటువేసి వచ్చిన అవ్వ



బాధ్యత: కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్

పోలింగ్ కేంద్రాల వద్ద పోటెత్తి కనిపించిన ఓటర్లు

- కంట్రోల్‌రూం నుంచి పోలింగ్ శైలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పర్యవేక్షణ
- సాయంత్రం 5 గంటల వరకు 64.08శాతం పోలింగ్
- అత్యధికంగా ఎమ్మిగనూరులో 68.48, అత్యల్పంగా కర్నూలులో 58. 15శాతం నమోదు
- గత ఎన్నికలతో పోలిస్తే తగ్గిన పోలింగ్ శాతం
- 2019 ప్రభంజనం పునరావృతమవుతోందంటున్న వైఎస్సార్‌సీపీ

పోలింగ్ ప్రశాంతం

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సార్వత్రిక సమరం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల శైలిని కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈ విడత పోలింగ్ శాతం తగ్గింది. పోలింగ్ శాతం, సరళి తదితర అంశాలను రాజకీయ పార్టీలు ఎవరికి వారు అనుకూలంగా విశ్లేషిస్తున్నారు. అయితే రాజకీయ విశ్లేషకులు మాత్రం కర్నూలు జిల్లాలో ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని, 2019 ఫలితాలు పునరావృతమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, కర్నూలు

జిల్లాలోని 7 అసెంబ్లీ, కర్నూలు పార్లమెంట్ స్థానానికి సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైంది. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడంతో కాస్త ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. ఆ తర్వాత నుంచి ఓటర్లు జిల్లా వ్యాప్తంగా పోటెత్తారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ భారీగా బారులుతీరారు. ఆ తర్వాత కూడా మహిళలు, వృద్ధుల సంఖ్య తగ్గకపోవడం విశేషం. ముఖ్యంగా పట్టణాల్లో పేదవర్గాల నుంచి పట్టణాల్లో రైతులు, పేదలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం 7గంటల వరకూ కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, ఆలూరులో భారీ వర్షం కురిసింది. దీంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడుతుందని భావించారు. అయితే 7 గంటలకు వర్షం తగ్గింది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు వర్షాన్ని లెక్కచేయకుండా ఉదయాన్నే పోలింగ్ సెంటర్లకు చేరుకున్నారు. గంట, గంటకూ భారీగా జనాలు సెంటర్లకు తరలివచ్చారు. దీంతో చాలా సెంటర్లలో భారీ క్యూలైన్లు కనిపించాయి. ఓటర్లు ఓపికగా క్యూలైన్‌లో నిల్చున్నారు. ఎండప్రభావం కూడా లేకపోవడంతో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసినా, అప్పటి వరకూ క్యూలైన్‌లలో ఉన్నవారితో రాత్రి వరకూ పోలింగ్ నిర్వహించారు.

రాయలసీమ యూనివర్శిటీ స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంల తరలింపు

పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల అధికారులు ఈవీఎంలకు సీల్ వేశారు. వాటిని పోలీస్‌బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలో రాయాలసీమ యూనివర్సిటీకి తీసుకొచ్చి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీలతో పాటు పాణ్యం అసెంబ్లీ ఈవీఎంలను కూడా ఆర్‌యూ స్ట్రాంగ్ రూంకే తరలించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ఘటనలు ఇవే

కర్నూలు ఉస్మానియా కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఒక సామాజికవర్గం వారు దొంగ ఓట్లు వేస్తున్నారని, ముఖ్యంగా మహిళా ఓటర్లను పరిశీలించలేదని టీడీపీ అభ్యర్థి భరత్ హల్‌చల్ చేశారు. అక్కడున్న మూడు కేంద్రాల్లోని ఏజెంట్లపై తిట్లదండకం అందుకున్నారు. అరగంట పాటు ఉన్న భరత్ ఒక్క ఆధారమూ చూపించకపోవడంతో అభాసుపాలై అక్కడి నుంచి వెనుదిరిగారు.



సేవ: దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న స్వచ్ఛంద సేవకులు

కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఎన్నికల పోలింగ్ శాతం

నియోజకవర్గం	2019 పోలింగ్‌శాతం	2024 (అర్ధరాత్రి 12 గంటల వరకు)
కర్నూలు	59.53	63.87
పత్తికొండ	83.97	84.14
కోడుమూరు (ఎస్సీ)	79.52	76.50
ఎమ్మిగనూరు	79.16	81.80
మంత్రాలయం	84.98	84.51
ఆదోని	65.31	63.51
ఆలూరు	79.71	82.77

టీడీపీకి సహకరించిన వన్‌టౌన్ సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

పాతబస్తీలోని 221, 225 పోలింగ్ స్టేషన్లలో టీడీపీ నాయకులు హంగామా సృష్టించారు. వన్‌టౌన్ సీఐతో పాటు 5గురు కానిస్టేబుళ్లు టీడీపీకి పూర్తి అనుకూలంగా పని చేశారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. అడుగడుగునా వైఎస్సార్‌సీపీ నేతలను ఇబ్బందిపెట్టారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



స్ఫూర్తి: ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్తున్న దివ్యాంగుడు

టీడీపీకి ఓటేయండిని ప్రచారం చేసిన ఎన్నికల అధికారి

ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం కారుమంచిలో 223, 224లో కొందరు అధికారులు టీడీపీకి ఓటేయండని అక్కడి ఓటర్లకు చెప్పారు. ఇది గ్రహించిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, ఇతర ఓటర్లు అధికారిపై వాదనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి అదుపు చేశారు. చిప్పగిరి మండలం ఏరూరులో 95, 96 పోలింగ్ బూత్‌లలో కూడా కొందరు అధికారులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారు. ఈ రెండుచోట్ల వాగ్వాదంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. పోలీసుల జోక్యంతో తిరిగి ప్రారంభమైంది.

➡ పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు అర్బన్‌లోని వీకర్‌సెక్షన్ కాలనీ(41వార్డు)లో నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ తనయుడు శివ, టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, పార్టీ శ్రేణులపై రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు. దీంతో కొద్దిపాటి వాగ్వివాదం జరిగింది. పోలీసులు ఇరువురిని అదుపు చేశారు.

➡ మంత్రాలయం మండలం మాధవరం 53వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న తెలుగు ఈరన్న(60) అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో మృత్యువాత పడ్డారు.

పోలింగ్ శాతం, సరళిపై వైఎస్సార్‌సీపీలో ధీమా

2019 ఎన్నికల్లో 78.28 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా 75.83శాతం నమోదైంది. దీంతో పోలింగ్‌శాతం తగ్గింది. అయితే కొన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. కర్నూలు అసెంబ్లీలో 2019లో 59.53 శాతం నమోదైతే, ఈ ఎన్నికల్లో 63.87శాతం నమోదైంది. అంటే 4.34శాతం పెరిగింది. కర్నూలులో మైనార్టీ ఓటర్లు అధికంగా ఉండటం, మైనార్టీ అభ్యర్థి బరిలో ఉండటంతో ఓల్డ్‌సిటీతో పాటు సిటీ పరిధిలోని మైనార్టీలు అధికంగా పోలింగ్‌కు వచ్చారని, దాంతోనే పోలింగ్‌శాతం పెరిగిందని వైఎస్సార్‌సీపీ నేతలు భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళలు, వృద్ధులు, రైతులు భారీగా తరలివచ్చారని వీరంతా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు పల్లెల్లో అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని భావిస్తున్నారు. ఓటేసేందుకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు సుదూరప్రాంతాల్లో ఉన్నవారు స్వప్రాంతాలకు వచ్చారు.

కంట్రోల్‌రూం నుంచి పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి వెబ్ కాస్ట్ ద్వారా అన్ని నియోజకవర్గాల పోలింగ్ సరళిని కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి పరిశీలించారు. ఓటర్లు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా పోలింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్టోరల్ ఆఫీసర్లు, బీఎల్‌ఓల ద్వారా పోలింగ్ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 6గంటల తర్వాత క్యూలైన్‌లో ఉన్నవారికి స్లిప్పులు అందజేసి రాత్రి వరకూ వారు ఓటు వేసేందుకు అనుమతిచ్చారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించారు.

వచ్చే నెల 4న కౌంటింగ్

మార్చి 16న షెడ్యూలు వెలువడింది. సుదీర్ఘ గడువు తర్వాత నాలుగో విడతలో భాగంగా సోమవారం పోలింగ్ జరిగింది. గత ఎన్నికల్లో ఫేజ్–1లో జరగడంతో పోలింగ్ తర్వాత 43 రోజులకు కౌంటింగ్ జరిగింది. అయితే ఇప్పుడు 21 రోజుల తర్వాత కౌంటింగ్ జరగనుంది. అప్పటి వరకూ ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుంది. కౌంటింగ్ వరకూ స్ట్రాంగ్‌రూంలు గట్టి బందోబస్తు పర్యవేక్షణలో ఉంటాయి.

పోలింగ్ మొదలు నుంచి ముగిసే దాకా

సమయం	జిల్లాలోని అసెంబ్లీల పోలింగ్‌శాతం (పాణ్యంతో కలిపి)	పార్లమెంట్ పరిధిలోని పోలింగ్‌శాతం
ఉదయం 9గంటలకు	9.24	9.61
11గంటలకు	22.05	21.86
ఒంటిగంటకు	38.00	37.61
3గంటలకు	52.26	52.49
5గంటలకు	64.55	64.08
అర్ధరాత్రి 12 గంటలకు	75.83	76.17



యువోత్సాహం.. ఓటు వేసి వేలిపై గుర్తు చూపుతున్న యువతులు



సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గోనెగండ్ల సమీపంలోని పొలంలో నిలిచిన నీరు



గోనెగండ్ల సమీపంలో కాలువలో పారుతున్న వర్షపు నీరు



ఫొటోలు: డి. హుస్సేన్

కోడుమూరు సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు

ఓట్ల పండుగలో 'చల్లని' పలకరింపు

శుభ సూచకం

కర్నూలు (అగ్రికల్చర్): ఓట్ల పండుగ వేళ జిల్లా ప్రజలకు వరుణుడు 'చల్లని' కబురు పంపారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన పండింది. భారీ వర్షాలతో వంకలు, వాగుల్లోకి నీరు వచ్చి చేరింది. హంద్రీ నదిలో ప్రవాహం కనిపించింది. హొళగుంద మండలం మినహా జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షపాతంనమోదైంది. భారీ వర్షాలు పడడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఎండ వేడిమి తగ్గడం, వడగాడ్పులు లేకపోవడంతో సార్వత్రిక ఎన్నికలకు శుభసూచకంగా కనిపించింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. జిల్లాలో అత్యధికంగా కృష్ణగిరిలో 105.6 మి.మీ, అత్యల్పంగా కల్లూరులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కోడుమూరులో 86.2, మద్దికెరలో 83.6, సి. బెళగల్‌లో 70.6, ఎమ్మిగనూరులో 68.8, మంత్రాలయంలో 59.4, గోనెగండ్లలో 56.4 మి.మీ, నందవరం 48.6, చిప్పగిరి 42.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 34.1 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షాలు కురవడంతో నీటి సమస్య తీరినట్లయ్యింది.

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని కోరిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన తాను కూడా ఓటు వేసి ఆదర్శంగా నిలిచారు. కలెక్టరేట్ వెనుక ఉన్న ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. అలాగే సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జాయింట్ కలెక్టర్, పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య తన ఓటు హక్కును భర్తతో కలసి వినియోగించుకున్నారు. ఇక కర్నూలు ఆర్వో, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తన భార్యతో కలసి కర్నూలు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. కోడుమూరు నియోజకవర్గ ఆర్వో, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి బాలాజీ నగర్ పరిధిలోని కేశవరెడ్డి స్కూలులో ఓటు వేశారు.

ఓటేసిన డీఐజీ, ఎస్పీ దంపతులు

కర్నూలు: కర్నూలులోని బి.క్యాంప్‌లో ఉన్న సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు సతీమణితో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే కర్నూలు కొత్తపేటలోని సెయింట్ జోసెఫ్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎస్పీ కృష్ణకాంత్ సతీమణితో కలసి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యత ఉందని, పౌరులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కలెక్టర్ సృజన



జేసీ మౌర్య దంపతులు





డీఐజీ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు

పోలింగ్ బూత్‌లోనూ టీడీపీ ప్రచారం

- ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి


మాట్లాడుతున్న విరూపాక్షి

దేవనకొండ: టీడీపీ నేతలు బరితెగించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ పోలింగ్ రోజు కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన దేవనకొండలోని 259 పోలింగ్ బూత్‌లో టీడీపీ వారు సూపర్ సిక్స్ పథకాల పేపర్లను చూపుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేశారు. విషయం తెలుసుకున్న వైస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి దేవనకొండకు చేరుకుని పరిశీలించారు. టీడీపీ నాయకులు ఇలా చేయడం తప్పు అని, పోలింగ్ బూత్‌లో ప్రచారం చేయకూడదన్నారు. టీడీపీ వాళ్ల ఓడిపోతామన్న భయంతోనే ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, టీడీపీ వారిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.


ఆదోని మండలం నారాయణపురంలో రాత్రి 8 గంటలైనా ఓటువేసేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు


ఆదోని పట్టణంలో బారులు తీరిన ఓటర్లు


నంద్యాల సంతగేటు ప్రాథమిక పాఠశాలలో తమ ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు


గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు


అవుకులో బారులు తీరిన మహిళలు

చుక్క పొడిచింది

యువ ఓటరు పోటెత్తారు.. మహిళలు బారులు దీరారు.. అవ్వాతాతలు, దివ్యాంగులు అడుగులో అడుగేసుకుంటూ కదలి వచ్చారు.. రాజ్యాంగం ఇచ్చిన హక్కును వినియోగించుకోవడానికి వయోజనులు ఉత్సాహం చూపారు. సోమవారం పోలింగ్ కేంద్రాల వద్ద చైతన్యం వెల్లివిరిసింది. ఉదయం 7 నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం అర్ధరాత్రి వరకు కొనసాగింది. మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. ఈవీఎంలలో తమ తీర్పును నిక్షిప్తం చేశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దడం సత్ఫలితాలను ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతంలో కంటే ఎక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. -సాక్షినెట్‌వర్క్


వెల్దుర్తి మండలం బోయనపల్లె పోలింగ్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్


ఆళ్లగడ్డలో ఓటర్లకు మందులు అందజేస్తున్న ఏఎన్‌ఎంలు


ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామంలో బారులు తీరిన ఓటర్లు


నంద్యాలలో ఓటు వేసి వస్తున్న దివ్యాంగుడు


బేతంచెర్ల పట్టణంలో ఓటు వేసిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి


ఉయ్యాలవాడలో ఓటు హక్కును వినియోగించుకున్న నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి


గడివేముల పోలింగ్ కేంద్రాన్ని ఫొటో తీసుకుంటున్న ఎన్నికల పరిశీలకుడు పంకజ్ కుమార్


ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో బురద అంటకుండా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు


ఎమ్మిగనూరు మండలం కె.తిమ్మాపురంలో ఓటు వేసేందుకు వెళ్తున్న దివ్యాంగురాలు


సి.బెళగల్ పోలింగ్ కేంద్రంలో గాయపడిన పోలింగ్ సిబ్బందికి వైద్య సేవలు అందుస్తున్న దృశ్యం


ఆత్మకూరులో బారులుతీరిన ముస్లిం ఓటర్లు


కౌతాళం మండలం బదినేహాళ్‌లో...


దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెలో బారులు తీరిన మహిళలు


ఆలూరులో బురదలోనూ ఓటువేసేందుకు..


అవుకు మండలం రామాపురంలో వర్షంలోనూ ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు

పోలింగ్ రోజూ టీడీపీ ప్రలోభాలు

- కేంద్రాల వద్దే యథేచ్ఛగా కరపత్రాలు ఉన్న కవర్లతో డబ్బుల పంపిణీ
- దొంగ ఓట్లు వేసిన ఆల్కాలీస్ ఉద్యోగులు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భోజనం, టిఫిన్లు, వాటర్ బాటిళ్లు సరఫరా చేసి పోలింగ్ సిబ్బందికి ఎర
- స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లకు డబ్బుతో ఎర
- కృతజ్ఞతతో సహకరించిన కొందరు ఏజెంట్లు



ఓటర్లతో టీడీపీ నాయకుల చర్చలు

కర్నూలు: టీడీపీ నేతలు పోలింగ్ రోజు కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. డబ్బులు పంచుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. కర్నూలులోని ఖండేరి వీధిలోని సీరాక్ స్కూల్ దగ్గర ఓ కిరాణ షాపులో టీడీపీ అభ్యర్థి తరఫున ఆయన శ్రేణులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పాతబస్తీ 6వ వార్డులోని గరీబ్ నగర్‌లో ఉన్న ఓ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ శ్రేణులు కరపత్రాలతో ఉన్న డబ్బు కవర్లను పంపిణీ చేసి ఓటర్ల మద్దతును కోరారు. బిర్లా గడ్డ వద్ద పోలింగ్ కేంద్రం సమీపంలోనే టీడీపీ నగర పార్టీ ప్రధాన హోదాలో ఉన్న ఓ నాయకుడు ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తూ హల్‌చల్ చేశాడు. కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌లోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఆల్కాలీస్ ఉద్యోగులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించగా ఆ ప్రాంతం ప్రజలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు ఆల్కాలీస్ ఉద్యోగులకు పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇవేకాదు.. టీడీపీ అభ్యర్థి ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారడానికి ఇంకెన్నో ఉదాహరణలు ఉన్నాయి. నిర్దేశిత ఓటర్లను ఎంచుకుని వారికి మాత్రమే డబ్బు పంపిణీ చేయడం కనిపించింది. వార్డుల్లో సక్రమంగా డబ్బులు పంపిణీ చేయలేదని తమ పట్ల వివక్ష చూపారని కొంతమంది మహిళల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలకు నిలదీతలు ఎదురయ్యాయి. కొంతమంది మహిళలకు అక్కడే డబ్బులు పంపిణీ చేసి దేవుడి మీద ఒట్టు వేయించుకోవడం కూడా పాతబస్తీలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది.

పోలింగ్ ఏజెంట్లకు ప్రలోభాలు...

ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేలా చూడటంలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అభ్యర్థి తరఫు ఏజెంట్ల పాత్ర కీలకం. బోగస్ ఓట్ల గుర్తింపు, అవకతవకలు లేకుండా పోలింగ్ జరగడానికి నిబద్ధతతో పని చేయాలి. ఈవీఎంలు తెరిచే సమయంలో పర్యవేక్షించడంతో పాటు ఓటరు జాబితా ఆధారంగా ప్రతి ఓటరును నిశితంగా పరిశీలించి అనుమానాలు ఉంటే అభ్యంతరాలు లేవనెత్తాలి. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలకు సీల్ వేసేవరకు అక్కడే ఉండి గమనించాలి. అన్ని పార్టీల అభ్యర్థుల పర్యవేక్షణలో పోలింగ్ జరిగితే అక్రమాలకు పాల్పడటానికి అవకాశం ఉండదని టీడీపీ అభ్యర్థి స్వతంత్రులతో పాటు ప్రతిపక్షాలకు చెందిన కొందరు ఏజెంట్లను డబ్బుతో ఎరవేసి ప్రలోభాలకు గురిచేసినట్లు ఆయన వర్గీయుల్లోనే చర్చ జరుగుతోంది.

పోలింగ్ సిబ్బందికి ఎర...

ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలింగ్ సిబ్బందికి కర్నూలులోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక మెనూ అమలు చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ బిస్కట్లు అందజేశారు. అయితే వారికి కూడా టీడీపీ అభ్యర్థి ధన బలంతో ఎర వేసి వారి సహాయం తీసుకునేందుకు ప్రయత్నించారు. కర్నూలులోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తన సిబ్బంది చేత టిఫిన్లు, భోజనాలు, వాటర్ బాటిళ్లు సరఫరా చేసి సహకారాన్ని కోరారన్న చర్చ జరిగింది. కొన్ని బూత్‌లలో రిలీవింగ్ పేరుతో టీడీపీ ఏజెంట్లు లోపలికి, బయటకు తిరుగుతూ అటు ఓటర్లను, ఇటు సిబ్బందిని ప్రలోభాలకు ప్రయత్నించారు. మరికొన్ని చోట్ల టిఫిన్లు, భోజనాల సరఫరా పేరుతో టీడీపీ కార్యకర్తలు పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకెళ్లడంతో పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బందికి తీవ్ర అంతరాయం కలిగింది. పాతబస్తీలోని మూడు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలు సరఫరా చేసే భోజనాలు అవసరం లేదంటూ సిబ్బంది నిరాకరించి వెనక్కు పంపారు. పాతబస్తీ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు బహిరంగంగా టీడీపీ మద్దతుగా సమీపంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లపై ఒత్తిడి చేయడం అక్కడ చర్చనీయాంశమయ్యింది. ఇదే విషయాన్ని అక్కడ ఉన్న కొందరు ఓటర్లు ఆ శాఖలోని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడం కూడా చర్చనీయాంశమయ్యింది.

అదే అతని 'చివరి' ఓటు


ఓటు వేసి మృతి చెందిన బోయ నరసింహుడు(ఫైల్)

పగిడ్యాల: మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన బోయ నరసింహుడు (65) సోమవారం సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న కొద్ది నిమిషాల్లో మృతి చెందాడు. ఇతను జగనన్నకు వీరాభిమాని. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం ఓటు వేయాలనే ఆతృతతో ఉదయాన్నే ఆటోలో పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. తనని కలసిన వారినందరికీ ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తానని చెప్పాడు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి ఇంటికొస్తుండగా మార్గమధ్యలోనే తుది శ్వాస విడిచాడు. బోయ నరసింహుడు మృతి సమాచారం తెలుసుకున్నా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యానారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, భూషిరెడ్డి తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన భారీ వృక్షం

గడివేముల:నంద్యాల - నందికొట్కూరు రహదారిలో ని తలముడిపి బాట సమీపంలో సోమవారం సాయంత్రం భారీ గాలులకు రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం నే లకూలింది. రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బీ టీ వెంకటసుబ్బయ్యఅక్కడికి చేరుకుని జేసీబీల ద్వారా చెట్టును తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.


నంద్యాల-నందికొట్కూరు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పిడుగు పడి యువకుడి మృతి

చిప్పగిరి: పిడుగుపాటుకు ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సుంకప్ప, రామేశ్వరమ్మ కుమారుడు సురేష్(25) డిగ్రీ పూర్తి చేసి తల్లిదండ్రులకు చేదుడుగా ఉన్నాడు. తెల్లవారుజామున బహిర్భూమికని వెళ్లిన సురేష్ ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. ఘటనా స్థలంలోని ఆనవాళ్లను బట్టి పిడుగుపాటుకు గురైనట్లు వారు తెలిపారు.

రూ. 1.86 లక్షల నగదు సీజ్

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని అగ్నిమాపకం కేంద్రం దగ్గర గల చెక్ పోస్ట్ దగ్గర తనిఖీల్లో రూ. 1.86 లక్షల నగదును సీజ్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెంకటాపురం కాలనీకి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి ఎటువంటి ఆధారం లేకుండా తన దగ్గర కలిగిన రూ. 1,86,000 సీజ్ చేసినట్లు తెలిపారు. నగదుకు సంబంధించిన ఆధారాలను చూపనందున సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీలో ఎస్ఎస్‌టీ టీం-1 మధుబాబు, ఎఫ్ఎస్‌టీ-టీం 1 వరప్రసాద్, సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు గౌస్ రబ్బానీ, పీసీలు భరత్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆదోని రోడ్డులో సీజ్ చేసిన నగదును చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి